గాంధీ విగ్రహం ధ్వంసం.. నలుగురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల: గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నలుగురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గురువారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ ఏసీపీ శ్రీనివాసరావు, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, బాలానగర్ ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. 191 కాలనీ ప్రగతినగర్‌కు చెందిన కొప్పడి నవీన్, నరసింహ, తన్నీరు బ్రహ్మయ్య, కూరల ప్రవీణ్ మద్యం మత్తులో ఈనెల 4న అర్ధరాత్రి లేక్‌వ్యూ కాలనీ ప్రగతినగర్ వద్ద ఉన్న గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఇది గమనించిన జెక్కా మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. అనంతరం వారిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న బాచుపల్లి, బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులను డీసీపీ అభినందించారు.

బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి


కులగణనలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్

రంగారెడ్డినగర్: బీసీ కులాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని శ్రీశైలంగౌడ్ నివాసంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లు ఇంటికి స్టిక్కర్ అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని, సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో వారికి అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు కులగణన చేపడుతున్నారని పేర్కొన్నారు.

సర్కారు భూములను పరిరక్షించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ అన్నారు. గురువారం బాచుపల్లి మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రభుదాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ మల్లన్న గుడి సమీపంలోని సర్వే నెంబర్‌లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి 20 వరకు దుకాణాలను ఏర్పాటు చేసి కిరాయికి ఇచ్చారన్నారు. అదే విధంగా వివిధ సర్వే నెంబర్‌లలో తప్పుడు పత్రాలను సృష్టించి భవన నిర్మాణం చేపట్టారని, సదరు నిర్మాణంపై ఫిర్యాదు రావడంతో బిల్డర్ కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకునేలా రెవెన్యూ అధికారులు సహకరించారని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలను ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్, ఈశ్వర్ రెడ్డి, ముఖేష్ గౌడ్, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

సర్వేతో వెనుకబడిన వర్గాలకు లబ్ధి

అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా


సర్వేలో పాల్గొన్న జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికగుప్తా

దుండిగల్: కుల గణన సర్వేతో వెనుకబడిన కులాల ప్రజలకు లబ్ధి చేకూరనుందని మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. గురువారం దుండిగల్ మున్సిపల్ పరిధి బహదూర్‌పల్లిలో జరిగిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులగణన సర్వేలో ఇళ్ల వాసులు తమ పూర్తి వివరాలను అందజేస్తే పథకాలు లబ్ధి పొందే అవకాశముందన్నారు. సిబ్బంది ప్రజల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే పూర్తి చేసిన ఇళ్లకు స్టిక్కర్లను అతికించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, మున్సిపల్ మేనేజర్ సునంద, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.



ప్రధాన రోడ్లపై ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చింతల్ మార్కెట్ రోడ్డు నుంచి వేంకటేశ్వర నగర్‌కు వెళ్లే రోడ్డులో పలు చోట్ల అనుమతులు లేకుండానే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. వాటిపై నుంచి వాహనాల రాకపోకలు సాగించే క్రమంలో కొన్ని బ్రేకర్లు ఊడిపోయి వాటి నట్‌బోల్టులు మిగిలాయి. నట్‌బోల్టులకు టైర్లు తాకి పంక్చర్లు అవుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అనుమతి లేని స్పీడ్ బ్రేకర్లను తొలగించి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– రంగారెడ్డినగర్



గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ ప్రధాన రోడ్డు చినుకు పడితే చిత్తడిగా.. ఎండ కొడితే ఎగిసిపడే దుమ్ముతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డును ఆనుకొని మండల ప్రాథమిక పరిషత్, తహసీల్దార్ కార్యాలయం ఉండటంతో వచ్చే వాహనాల దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వాహనం వచ్చినప్పుడు దట్టమైన దుమ్ము, ధూళి ఎగసిపడి స్థానికంగా ఉన్న దుకాణాలు, ఇళ్లను కప్పేస్తుందని బస్తీ వాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి నూతన రోడ్డు వేయాలని కోరుతున్నారు.

– సుభాష్‌నగర్

చెట్ల చాటున వెలుగులు..

అంధకారంలో కాలనీలు


చీకట్లో మొబైల్ లైట్ల సహాయంతో రాకపోకలు సాగిస్తున్న కాలనీ వాసులు


విద్యుత్ దీపాలకు అల్లుకున్న తీగలు, చెట్ల కొమ్మలు

- రాత్రి వేళ కాలనీ వాసుల తిప్పలు
- మరో వైపు కుక్కల భయం
- విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగలు
- పట్టించుకోని అధికారులు

కొంపల్లి మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకోవడంతో రాత్రి వేళ వెలుగులు లేక కాలనీలు చీకటిమయంగా మారుతున్నాయి. ఎన్‌సీఎల్ నార్త్, నోబుల్ కాలనీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. వారం రోజులుగా కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. మరికొన్ని వెలిగినా చెట్ల కొమ్మలు, తీగల చాటున ఉండటంతో చీకటిమయంగా ఉంటుంది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో బిక్కు బిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

– కుత్బుల్లాపూర్

విద్యుత్ దీపాలకు అల్లుకున్న తీగలు

కొంపల్లి కొంపల్లి మున్సిపల్ పరిధిలోని ఎన్‌సీఎల్ నార్త్, నోబుల్ కాలనీల్లో వీధి దీపాలకు చెట్లు, తీగలు అల్లుకుని రాత్రి వేళల్లో సరిగా వెలుతురు కనిపించడం లేదు. కొన్ని చోట్ల విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో చిమ్మచీకటిగా ఉంటుంది. గజానాన, వెంకట సాయి, సాయి కృష్ణ బృందావన్, దక్ష్‌ఎంక్లేవ్, ప్లేసెంట్ వాలీ అపార్ట్‌మెంట్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట చెట్ల పొదల నుంచి ఎక్కడ విష సర్పాలు వస్తాయోనన్న భయంతో మొబైల్ లైట్ల సహాయంతో రాకపోకలు సాగిస్తున్నారు. ఇక ఎన్‌సీఎల్ నార్త్ కాలనీలో ఇటీవల పలువురు వీధి కుక్కల కాటుకు గురైన ఘటనలు ఉండటంతో చీకట్లో ఒంటరిగా వెళ్లేందుకు జంకుతున్నారు. నలుగురైదుగురు కలిసి వీధుల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక కార్యాలయాల నుంచి రాత్రి వేళల్లో ఇంటికి వచ్చే ఉద్యోగులు కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఇళ్లకు వస్తున్నారు.


ఎన్‌సీఎల్ నార్త్‌లో చీకట్లో కుక్కల బెడద

అధికారులు పట్టించుకోవడం లేదు

వారం రోజులుగా కొంపల్లి మున్సిపల్ పరిధిలోని 12, 13 వార్డుల్లో కొన్ని రోజులుగా చీకటి పడగానే చిమ్మచీకటి అలుముకుంటుంది. వీధి దీపాలకు మరమ్మతులు చేయించాలని అధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోవడం లేదు. ఈ ప్రాంతంలో సుమారు 20 దీపాలు పని చేయడం లేదు. మరికొన్ని చోట్ల దీపాలు ఉన్నా చెట్ల కొమ్మలు కప్పేయడంతో వెలుగు రావడం లేదు. అధికారులు ఇప్పటికైనా వీధి దీపాలకు మరమ్మతులు చేయించాలి.

– శివాజీరాజు, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్

బైక్‌పై వెళ్తుండగా ఫిట్స్.. వ్యక్తి మృతి


ఉపేందర్‌రెడ్డి(ఫైల్)

దుండిగల్: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తికి ఫిట్స్ రావడంతో కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బాచుపల్లి క్రాంతినగర్ కాలనీకి చెందిన అలుగుపల్లి ఉపేందర్ రెడ్డి (55) స్థానికంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బహదూర్‌పల్లి నుంచి గండిమైసమ్మ చౌరస్తా వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వేదిక ఫంక్షన్ హాల్ సమీపంలో అతడికి ఫిట్స్ రావడంతో బండిపై నుంచి కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో సూరారంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు హేమంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌ఐ బదిలీ.. సన్మానం


ఎస్‌ఐ సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

నిజాంపేట్: జీడిమెట్ల పీఎస్‌కు బదిలీ అయిన బాచుపల్లి ఎస్‌ఐ సత్యనారాయణను గురువారం బీజేపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నిజాంపేట్ అధ్యక్షుడు భిక్షపతియాదవ్, బాచుపల్లి అధ్యక్షుడు ప్రసాదరాజు ఆయనను శాలువతో సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ రఘుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గుప్తా, సచిన్, బిజినెస్ సెల్ కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


కోటేశ్వరరావు(ఫైల్)

నిజాంపేట్: ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రగతినగర్ ఎన్‌ఆర్‌ఐ కాలనీకి చెందిన కోటేశ్వరరావు(75) గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా అతని ఆచూకీ తెలియలేదు. కోటేశ్వరరావుకు ఒక కన్ను సరిగా కనిపించదని, సరిగ్గా గుర్తు పట్టలేడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫాక్స్‌సాగర్ చెరువు వద్ద ఛట్‌పూజ సందడి


చెరువు వద్ద పెద్ద ఎత్తున్న పాల్గొన్న ప్రజలు


చెరువులో దిగి సూర్య భగవానుడిని కొలుస్తూ..

జీడిమెట్ల: బిహారీలు, ఉత్తరప్రదేశ్ ప్రజలు దీపావళి తర్వాత ఆరవరోజు అత్యంత పవిత్రంగా జరుపుకునే ఛట్‌పూజ గురువారం ప్రారంభమైంది. రెండు రాష్ట్రాల ప్రజలు గురువారం సూర్యాస్తమయం సమయానికి స్థానిక ఫాక్స్‌సాగర్ చెరువు వద్ద అలంకరించి మట్టితో భగవంతుడిని తయారు చేశారు. పూలు, పండ్లు, చెరుకు గడలు, కొబ్బరికాయలు సమర్పించారు. అనంతరం మహిళలు, పురుషులు నీటిలోకి దిగి తమ కుటుంబంలో ఉన్నవారంతా సంతోషంగా ఉండాలని సూర్య భగవానుడిని పూజించారు. పిల్లలు టపాకాయలు కాల్చారు. ఫాక్స్‌సాగర్ వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో పండగ వాతావరణం నెలకొంది.

శేరిలింగంపల్లిలో మరో ఎక్సైజ్ స్టేషన్

చందానగర్: ఇటీవల రాష్ట్రంలో కొత్తగా ఎక్సైజ్ స్టేషన్ల ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో శేరిలింగంపల్లి మండలంలో మరొక ఎక్సైజ్ స్టేషన్ రానుందని మండల ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి మండలం పరిధి ఎక్కువగా ఉన్నందున స్టేషన్‌ను కుదించి నూతనంగా కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. డివిజన్ల వారీగా విభజించనున్నారని కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌లోకి మాదాపూర్, కొండాపూర్ డివిజన్లు, శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లోకి గచ్చిబౌలి, చందానగర్, మియాపూర్, శేరిలింగంపల్లి డివిజన్లు వస్తాయన్నారు. ఇప్పటికి వరకు మండలంలో 39 వైన్ షాపులు, 134 బార్‌లు ఉన్నాయన్నారు. ఇందులో ఎన్ని వైన్ షాపులు, బార్‌లు మరో ఎక్సైజ్ స్టేషన్‌కు వెళ్తాయో గెజిట్ విడుదల చేస్తే తెలుస్తుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జీడిమెట్ల: విద్యుత్ మరమ్మతుల కారణంగా జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గురువారం అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల ఫేజ్–5 ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30గంటల వరకు, మెఘా ఇంజనీరింగ్, సోధనా ల్యాబ్స్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

దుండిగల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గాగిల్లాపూర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిపోచంపల్లి ఏఈ సురేందర్ రెడ్డి గురువారం ఓ ప్రకటన తెలిపారు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం నుంచి 1.30 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. గాగిలాపూర్ చౌరస్తా, చర్చి గాగిలాపూర్, చైతన్య కాలనీ, సర్వే నెంబర్ 214, రాజీవ్ గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారురు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు



ప్రభుత్వ స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న ఆర్‌ఐ

కుత్బుల్లాపూర్ : ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం కలీం అన్నారు. గాజులరామారంలోని సర్వే నెంబర్ 12లో గురువారం సదరు స్థలం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలువైన స్థలాన్ని కబ్జా కాకుండా బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల సర్వే నెంబర్ 79 లో కూడా పలుచోట్ల బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి


సైబరాబాద్ కమిషనరేట్‌లో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీపీ అవినాష్ మహంతి

రాయదుర్గం: కేన్సర్ అనేది తీవ్ర ఆరోగ్య సమస్య అని సైబరాబాద్ కమిషనర్, ఎస్‌సీఎస్‌సీ చైర్మన్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. గురువారం సైబరాబాద్ కమిషనరేట్‌లో సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ), గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్, ఎన్‌సీడీ స్క్రీనింగ్ బస్ ద్వారా గ్రేస్ క్యాన్సర్ ఫౌండేసన్ గ్లోబల్ సీఈఓ డాక్టర్ సుంకవల్లి చినబాబు, డాక్టర్ ప్రమీలారాణి, వైద్య బృందం సంయుక్త ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే సకాలంలో చికిత్స తీసుకుని తగ్గించుకోవచ్చన్నారు.పోలీసులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ గ్లోబల్ సీఈఓ డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ ప్రతి యేటా భారతదేశంలో రెండు మిలియన్ కేన్సర్ కేసులు నమోదు అవుతున్నాయన్నారు. కార్యక్రమంలోసైబరాబాద్ జాయింట్ కమిషనర్ డి జోయల్ డేవిస్, ఎస్‌సీఎస్‌సీ సెక్రెటరీ జనరల్ రమేష్ కాజా, ఏడీసీపీలు రవిచందన్ రెడ్డి, షమీర్, ఏసీపీ గంగారామ్, ఎస్‌సీఎస్‌సీ అసోసియేట్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, హెల్త్ ప్రొగ్రామ్ మేనేజర్ ప్రవీణ్ ఉమ్మడి,ఎస్‌సీఎస్‌సీ విమెన్స్ ఫోరమ్ మెంబర్ రిలేషన్స్ మేనేజర్ లలిత, సీటీసీ డాక్టర్ డాక్టర్ సరిత, ఫౌండేషన్ సలహాదారు గారపాటిప్రసాద్, వ్యవస్థాపక ట్రస్టీ డాక్టర్ ప్రమీలారాణి, సైకియాట్రిస్ట్ డాక్టర్ దీప్తి,డాక్టర్ సురి, 35 మంది వైద్య బృందం , బీఎస్ రాజేష్ పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

మూసాపేట: భరత్ నగర్ కాలనీలోని పలు రెస్టారెంట్లలో గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. కాలనీలోని పలు రెస్టారెంట్‌లలో మూసాపేట ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పవన్ నేతృత్వంలో తనిఖీలు జరిగాయి. అపరిశుభ్రమైన వంటగది, బొద్దింకలు కనిపించాయి. ఆహార వస్తువులను కవర్ చేయకపోవటం, సరిగ్గా లేబుల్ చేయకపోవడంతో పాటు మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పెస్ట్ కంట్రోల్ రికార్డులు నిర్వహించ లేదు. దీంతో నోటీసులను అందజేశారు. కృతుంగతో పాటు విక్టోరియా రెస్టారెంట్‌లలో కూడా తనిఖీలు చేసినట్లు అధికారులు తెలిపారు.

లోటుపాట్ల సవరణకు ఎలక్షన్ కమిషన్ చర్యలు

జిల్లా ఎన్నికల పరిశీలకుడు రహమ్మత్ అలీ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు రహమ్మత్ అలీ

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యత నిచ్చే దిశగా స్వచ్ఛమైన, పవిత్రమైన ఎన్నికలను నిర్వహించేందుకు జాతీయ ఎలక్షన్ కమిషన్ గత అనుభవాలతో ఎప్పటికప్పుడు నూతన మార్గదర్శకాలను రూపొందిస్తోందని మేడ్చల్ జిల్లా ఎన్నికల పరిశీలకుడు రహ్మత్ అలీ అన్నారు. గురువారం కలెక్టరేట్ వీసీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను, చిన్న, చిన్న అంశాలను కూడా దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో స్వచ్ఛమైన, పవిత్రమైన ఎన్నికలను నిర్వహించేందుకు జాతీయ ఎన్నికల కమిషన్ అవసరమైన మార్గదర్శకాలను రూపొందిస్తూ ఎప్పటికప్పుడు సవరిస్తూ ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని ఎన్నికల పరిశీలకుడు అలీ అన్నారు. జిల్లాలో 2,435 పోలింగ్ బూత్‌లు ఉన్నప్పటికీ ఓటింగ్ శాతం తక్కువగా ఉందని, దీన్ని పెంచాలన్నారు. జిల్లా యంత్రాంగంతోపాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సమన్వయంతో కృషి చేస్తే తప్పకుండా ఓటింగ్ శాతం పెరుగుతుందని పేర్కొన్నారు. ఓటరు ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను తీవ్రంగా పరిగణించి సవరణలు, డెత్ కేసులను ఎప్పటికప్పుడు సవరించేలా సంబంధిత ఫారాలైన 6, 6ఏ, 7ఏ, 8లలో నమోదు చేసుకునేలా బీఎల్ఏలు, బీఎల్‌వోలు ప్రజలకు తెలియజేసి ఓటరు జాబితాను అప్‌డేట్ చేయాలన్నారు. సవరణ జాబితాలో పెండింగ్‌లో ఉన్న 6,642 నమోదులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. ఈ ఆర్‌ఓలు, పార్టీ ప్రతినిధులు, బీఎల్‌ఓలు, బీఎల్ఏలు బూతు, గ్రామీణ, మండల స్థాయిల్లో క్రమం తప్పకుండా సమావేశాలను ఏర్పాటు చేసి ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలన్నారు. మహిళా ఓటర్ల శాతాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల ప్రతినిధులు వారి వారి సలహాలను, సూచనలను ఇవ్వాలని పరిశీలకులు కోరారు.

ఓటుహక్కు నమోదులో సమస్యలు

జిల్లా కలెక్టరు గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని 60 శాతం ప్రాంతాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్నాయని, గ్రామీణ స్థాయిలో ఓటింగ్ శాతం తగ్గుతోందన్నారు. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలోని సమస్యను ఎలక్షన్ కమిషన్ వారు మాత్రమే సవరించగలరని తెలిపారు. జాబితాలో సవరణలను సకాలంలో పూర్తి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేవారికి సాఫ్ట్‌వేర్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, చాలా సమయం కేటాయించినప్పటికీ రిజిస్ట్రేషన్ కావడం లేదని తెలిపారు. బీఎల్‌ఓల రెమ్యూనరేషన్ పెంచాలని సూచించారు. హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ఓటు హక్కు నమోదు ప్రక్రియలో చాలా సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకుపోవాలని పరిశీలకులను కోరారు.